

త్వరలో జీహెచ్‌ఎం పదోన్నతులు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 1 : పాఠశాల విద్యాశాఖలో మరోసారి పదోన్నతులు చేపట్టనున్నారు. గత నెలలో కొందరు రిటైర్ కావడంతో ఏర్పడిన ఖాళీలతో పాటు ఇటీవల జరిగిన బదిలీలు, పదోన్నతుల అనంతరం ఖాళీగా మిగిలిన గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయనున్నారు. జీహెచ్‌ఎం పదోన్నతులకు సంబంధించిన ఖాళీలు, స్కూల్ అసిస్టెంట్‌ల సీనియారిటీ జాబితాను ఇప్పటికే సిద్ధం చేశారు. మూడు రోజుల్లో ఈ ప్రక్రియ చేపట్టేందుకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.



స్ట్రయిక్ కొడితే.. కాయిన్ పడాల్సిందే..

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సంగారెడ్డి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా కోర్టులో గురువారం క్రీడలను ప్రారంభించారు. జిల్లా ప్రధాన న్యాయాధికారి భవానీచంద్ర క్యారమ్స్ ఆడి క్రీడలను ప్రారంభించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, క్రీడలు, సాంస్కృతి కార్యదర్శి అశోక్, న్యాయవాదులు పాల్గొన్నారు.

-సంగారెడ్డి క్రైం



ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట మోసం

పెట్టుబడుల పేరుతో రూ. 15 లక్షలు కొట్టేశారు..

తూప్రాన్, ఆగస్టు 1: ఇన్‌స్టాగ్రామ్‌లో లభించిన లింక్ ఓపెన్ చేసి ట్రేడింగ్ చేసిన ఒకరు రూ. 15 లక్షలు మోసపోయారు. మెదక్ జిల్లా తూప్రాన్‌లో చోటు చేసుకున్న ఈ సైబర్ నేరం వివరాలు ఎస్‌ఐ శివానందం కథనం ప్రకారం.. పట్టణంలో నివాసముంటూ ప్రైవేటు వ్యాపారం చేసే ఒకరు ఇన్‌స్టాగ్రామ్‌లో ట్రేడింగ్ కోసం సెర్చ్ చేయగా, ఓ లింక్ లభించడంతో క్లిక్ చేశాడు. దీంతో ఐఐఎఫ్ఎల్ సెక్యూరిటీస్ అనే ఓ వాట్సాప్ గ్రూప్‌లో అతడిని యాడ్ చేశారు. ఐఐఎఫ్ఎల్ ప్రొ అనే యాప్ డౌన్‌లోడ్ చేసి ట్రేడింగ్ రిలేటెడ్ విషయాలు చూశాడు. అందులో పలు దఫాలుగా రూ. 15 లక్షల వరకు చెల్లించాడు. జూలై 5న ఐడీబీఐ బ్యాంకు ఖాతాలో రూ. 5.10 లక్షల ప్రాఫిట్ జమ అయినట్లు చూపించింది. తర్వాత ఆ డబ్బులూ ట్రేడింగ్‌లోనే పెట్టించుకున్నారు. ఆ తర్వాత ఐఐఎఫ్ఎల్ ప్రొ యాప్‌లో రూ. 95 లక్షలు చూపిస్తున్నప్పటికీ, విత్‌డ్రా చేసేందుకు వీలుకావడంలేదు. దాంతో సంస్థ కస్టమర్ కేర్ నంబర్‌కు వాట్సాప్‌లో సంప్రదించగా, రూ. 4 లక్షలు చెల్లిస్తే విత్ డ్రా చేసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. తన ఖాతాలో రూ. 4లక్షలు మినహాయించుకోవాలని చెప్పగా, అలా కుదరదని చెప్పారు. దీంతో మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఏసీబీ పంజా..

సంగారెడ్డి జిల్లాలో కలకలం

జిల్లా కేంద్రంలోని రిజిస్ట్రేషన్ కార్యాలయంలో తనిఖీలు

అధికారులను చూసి కిటికీ నుంచి రూ. లక్ష బయటకు విసిరివేత

సీజ్ చేసిన అధికారులు... కొనసాగుతున్న సోదాలు



రిజిస్ట్రేషన్ కార్యాలయంలో నగదును స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

కంది, ఆగస్టు 1: సంగారెడ్డి జిల్లా కంది మండల కేంద్రంలోని సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో గురువారం సాయంత్రం అవినీతి నిరోదక శాఖ (ఏసీబీ) అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గురువారం సాయంత్రం 6 గంటల నుంచి అర్ధరాత్రి వరకు ఈ సోదాలు కొనసాగాయి. ఏసీబీ అధికారులను చూసి రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఉన్న గుర్తు తెలియని వ్యక్తులు రూ.లక్ష నగదు కిటికీ నుంచి బయటకు పారవేశారు. గమనించిన ఏసీబీ అధికారులు ఆ డబ్బును స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. ఈ డబ్బు ఎవరిది, ఎక్కడి నుంచి వచ్చిందీ అనే విషయాలపై అధికారులు ఆరా తీస్తున్నారు. స్థలాలు, ప్లాట్ల రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన క్రయవిక్రయదారుల వాహనాలను కూడా ఏసీబీ అధికారులు తనిఖీ చేశారు. కొంతమంది క్రయవిక్రయ దారుల వాహనాల్లో లభ్యమైన కొంత నగదును కూడా ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. ఈ దాడుల నేపథ్యంలో కంది నుంచి కాశీపూర్ వరకు ఉన్న డాక్యుమెంట్ల రైటర్లంతా భయాందోళనకు గురై దుకాణాలను మూసివేశారు. కొంత మంది రిజిస్ట్రేషన్ సిబ్బందిని కార్యాలయంలో ఉంచి విచారణ జరుపుతున్నట్టు ఏసీబీ హైదరాబాద్ జోన్ డీఎస్పీ ఉదయ్‌రెడ్డి తెలిపారు. ఈ సోదాలు శుక్రవారం తెల్లవారుజాము వరకు జరుగుతాయని ఆయన వెల్లడించారు.





అధికారుల వాహనాలను తనిఖీ చేస్తున్న అధికారులు

రూ. 30 వేలు లంచం తీసుకుంటూ..

చిక్కిన జూనియర్ అసిస్టెంట్, ధరణి ఆపరేటర్

పటాన్‌చెరు, ఆగస్టు 1 : భూమి ఫౌతీ మార్పిడి చేసేందుకు రూ. 30 వేలు డిమాండ్ చేసి, డబ్బులు తీసుకుంటున్న సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ తహసీల్దార్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ ధరణి ఆపరేటర్‌లను ఏసీబీ అధికారులు గురువారం పట్టుకున్నారు. బండ్లగూడ గ్రామానికి చెందిన వెంకటేశం యాదవ్ తన అత్త మల్లెల జయమ్మ పేరిట ఉన్న వ్యవసాయ భూమికి సంబంధించి వారసత్వ ఫౌతీ మార్పిడి కోసం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చాడు. ఫౌతీ మార్పిడికి జూనియర్ అసిస్టెంట్, ధరణి ఆపరేటర్లు రూ.30 వేలు లంచం డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. గురువారం సాయంత్రం కార్యాలయంలోనే జూనియర్ అసిస్టెంట్ మన్నె సంతోష్, ధరణి ఆపరేటర్(అవుట్ సోర్సింగ్) చాకలి అరుణ్‌కుమార్‌లకు బాధితుడు రూ. 30 వేలు ఇస్తుండగా, ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. నిందితులిద్దరిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. లంచంగా తీసుకున్న డబ్బును కార్యాలయ ఆవరణలో పార్క్ చేసిన ధరణి ఆపరేటర్ చాకలి అరుణ్‌కుమార్‌కు చెందిన టీఎస్ 15, ఎఫ్‌బీ 5102 కారు డ్యాష్‌బోర్డులో నుంచి స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో అమీన్‌పూర్ తహసీల్దార్ పి.రాధ పాత్రపై ఏసీబీ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. నిందితులు ఇచ్చిన వాంగ్మూలం మేరకు తహశీల్దార్ ఇంటిలో సోదాలు నిర్వహించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. నిందితులిద్దరిని అరెస్ట్ చేసి హైదరాబాద్ ఏసీబీ ప్రత్యేక కోర్టుకు రిమాండ్‌కు తరలించారు.



పట్టుబడిన తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది

ఆపరేషన్ ముస్కాన్..

బాల కార్మికులకు విముక్తి

మెదక్ అర్బన్/సంగారెడ్డి క్రైం, ఆగస్టు1: ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా మెదక్ జిల్లాలో 47 మంది బాల కార్మికులకు విముక్తి కల్పించామని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. నెల రోజుల పాటు జిల్లావ్యాప్తంగా దాడులు నిర్వహించామన్నారు. బాల కార్మికులను గుర్తించి విముక్తి కల్పించి.. వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి పిల్లలను అప్పగించామన్నారు. బాలలతో పనిచేయిస్తున్న ఒకరిపై కేసు నమోదు చేశామన్నారు. అలాగే, సంగారెడ్డి జిల్లాలో 66 మంది బాలకార్మికులకు విముక్తి కలిగించినట్టు సంగారెడ్డి ఎస్పీ రూపేశ్ తెలిపారు. బాలలతో పని చేయిస్తున్న 23 మందిపై కేసులు నమోదు చేసినట్టు పేర్కొన్నారు. వీధి బాలలు కనిపిస్తే 1098, లేదా డయల్ 100, 112కు సమాచారం అందించాలని వారు పేర్కొన్నారు.

ఆధార్, ఖాతాల ఎంట్రీకి ఆప్షన్

- తూప్రాన్ సొసైటీలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు
- ఒక్కరోజే 120 మంది రైతుల వివరాలు అప్‌డేట్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తూప్రాన్, ఆగస్టు 1: తూప్రాన్ సొసైటీ పరిధిలో రుణమాఫీ అమలు చేసేందుకు అధికారులు ఆఘమేఘాల మీద చర్యలు చేపట్టారు. సొసైటీ ప్రాంగణంలో గురువారం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటుచేసి రుణమాఫీకి అర్హులైన రైతుల నుంచి ఆధార్‌కార్డు జిరాక్సులు సేకరించారు. తూప్రాన్ సొసైటీ పరిధిలో అర్హులైన 613 మంది రైతులకు రుణమాఫీ జరగకపోవడంపై 'అధికారుల తప్పిదం.. రైతులకు శాపం' శీర్షికతో గురువారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో, కలెక్టర్ స్పందించి సమస్య పరిష్కరించాలని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సీఈవో, జిల్లా కోఆపరేటివ్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలతో సొసైటీ పరిధిలో ఆధార్, ఖాతా వివరాలను సరిచేసేందుకు అవకాశం కల్పించారు. తూప్రాన్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు మేనేజర్ ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి, సొసైటీ చైర్మన్ మెట్టు బాలకృష్ణారెడ్డి, డైరక్టర్ల ద్వారా రైతులకు సమాచారం అందజేశారు. గురువారం ఒక్కరోజే 120 మంది రైతులు ఆధార్ జిరాక్సులు అందజేసినట్లు మేనేజర్ ప్రసాద్ వివరించారు. 'ఆంధ్రజ్యోతి' కథనంతో అధికారుల్లో చలనంరావడంతో రైతులు కృతజ్ఞతలు తెలిపారు.



వివరాలు అప్‌డేట్ చేయించేందుకు ఏర్పాటు చేసిన కౌంటర్

వసతిగృహం విద్యార్థులకు

తాజా కూరగాయలు..!

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



వట్‌పల్లి, ఆగస్టు 1 : వసతిగృహంలో అధ్వాన పరిస్థితులపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'మీ ఇంట్లో ఇలాంటివే తింటారా?' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. వట్‌పల్లి మండలం దేవునూర్‌లోని వసతిగృహం విద్యార్థులకు నాసిరకం ఆహారం, కలుషితమైన నీరు అందిస్తుండడం, సౌకర్యాలు లేకపోవడంపై గురువారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ కథనంపై కలెక్టర్ వల్లూరి క్రాంతి స్పందించారు. విచారణ చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈమేరకు వట్‌పల్లి ఎంపీడీవో శశిప్రభ, అసిస్టెంట్ సోషల్‌వెల్ఫేర్ అధికారి శ్రీనివాస్ వేర్వేరుగా వసతిగృహాన్ని సందర్శించి విచారణ చేపట్టారు. హాస్టల్‌లో పరిస్థితులను పరిశీలించారు. అయితే, అధికారులు విచారణకు వస్తున్నట్టు ఉప్పందడంతో హాస్టల్ వార్డెన్ ముందే అప్రమత్తమయ్యారు. హుటాహుటిన వసతిగృహాన్ని శుభ్రం చేయించారని, తాజా కూరగాయలను తెప్పించారని గ్రామస్థులు, తల్లిదండ్రులు తెలియజేశారు. వచ్చిన అధికారులు తూతూమంత్రంగా విచారించారని ఆరోపించారు.



హస్టల్‌ను పరిశీలిస్తున్న అధికారులు



సంగారెడ్డి జీజీహెచ్‌లో నర్సింగ్ ఆఫీసర్లు ఫుల్..

- బదిలీలతో పోస్టులన్నీ భర్తీ
- తీరిన సిబ్బంది కొరత
- రోగులకు సకాలంలో వైద్య సేవలు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 1 : ఆస్పత్రికి వచ్చిన రోగులకు సేవలందించబడంలో డాక్టర్ల పాత్ర ఎంత కీలకమో.. నర్సింగ్ ఆఫీసర్ల (స్టాఫ్ నర్సులు) పాత్ర అంతే ముఖ్యం. డాక్టర్ రోగిని పరీక్షించి అందించాల్సిన వైద్య సేవలు సూచిస్తే.. నర్సింగ్ సిబ్బంది ఆయా సేవలు, మందులు అందజేస్తారు. సాధారణ ప్రసవాల్లోనూ ప్రధాన పాత్ర నర్సింగ్ ఆఫీసర్లదే. అలాంటిది కొంతకాలంగా సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, మాతాశిశు ఆరోగ్య కేంద్రాల్లో వీరి కొరతతో సేవల్లో జాప్యమవుతోంది. ఉన్నవారిపై భారం పడుతున్నది. ఈ తరుణంలో సాధారణ బదిలీల్లో భాగంగా వివిధ ఆస్పత్రుల నుంచి ఇక్కడికి నర్సింగ్ ఆఫీసర్లు బదిలీపై వచ్చారు.

మంజూరైన పోస్టులన్నీ భర్తీ

సంగారెడ్డి జీజీహెచ్, ఎంసీహెచ్ కలిపి 354 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులను ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో ప్రభుత్వం చేపట్టిన కొత్త నియామకాల ద్వారా 144 మంది నర్సింగ్ ఆఫీసర్లు ఇక్కడ విధుల్లో చేరారు. పాతవారు 11 మంది ఉండగా, తాజాగా మిగిలిన 199 ఖాళీ పోస్టులు కూడా సాధారణ బదిలీ ద్వారా గురువారం భర్తీ అయ్యాయి. దీంతో, ఆస్పత్రిలో మంజూరైన 354 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులు పూర్తిగా భర్తీ అయ్యాయి. బదిలీలతో ఆస్పత్రిలో నర్సింగ్ ఆఫీసర్ల పోస్టులన్నీ భర్తీ కావడంతో రోగులకు సకాలంలో పూర్తిస్థాయిలో వైద్య సేవలందించేందుకు వీలుపడిదని జీజీహెచ్ మెడికల్ సూపరింటెండెంట్ డా.అనీల్‌కుమార్ తెలిపారు.

'నిమ్జ్' రెండో విడత భూసేకరణ వద్దు

కలెక్టర్ వల్లూరు క్రాంతితో మొరపెట్టుకున్న రైతులు

వెమ్‌టెక్నాలజీ ప్రతినిధులతో సంగారెడ్డి కలెక్టర్ సమీక్ష



కంపెనీ ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరి క్రాంతి

ఝరాసంగం, ఆగస్టు 1 : నిమ్జ్ ప్రాజెక్ట్‌లో ఏర్పాటు చేస్తున్న వెమ్ టెక్నాలజీ కంపెనీ ఎండీ వెంకటరాజ్, హుండై ప్రతినిధులతో సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి గురువారం సమావేశమయ్యారు. కంపెనీ నిర్మాణానికి ఇబ్బందులు లేకుండా రోడ్డును ఏర్పాటు చేయాలని ఆయా సంస్థల ప్రతినిధులు కలెక్టర్‌కు విన్నవించారు. ఎల్గోయి, చీలపల్లి గ్రామ శివారులోని నిమ్జ్ ప్రాజెక్ట్ భూములు, రోడ్ల నిర్మాణపు మ్యాప్‌ను కలెక్టర్ పరిశీలించారు. నిమ్జ్ రెండో విడత భూసేకరణలో భూములు ఇవ్వబోమని రైతులు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మొదటి విడతలో ఏల్గోయి గ్రామంలో 2వేల ఎకరాల భూమిని సేకరించారని తెలిపారు. మిగిలిన కొద్ది సాగుభూమిని తీసుకుంటే తామెలా బతకాలని ప్రశ్నించారు. కలెక్టర్ వెంట నిమ్జ్ ప్రాజెక్ట్ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లు రవీందర్‌రెడ్డి, నాగలక్ష్మి, జహీరాబాద్ ఆర్డీవో రాజు, పంచాయతీరాజ్ శాఖ అధికారులు, డిప్యూటీ తహసీల్దార్ యాసీన్, ఆర్‌ఐ రామరావు జహీరాబాద్ రూరల్ సీఐ రామనాయుడు, ఎస్‌ఐ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పించాలి

కోహీర్ : మండలంలోని కొత్తూరు(డి) గ్రామంలో గోద్రెజ్ అగ్రోవేట్ సంస్థ ఏర్పాటు చేసిన నర్సరీలో ప్లాంటేషన్‌కు సిద్ధం చేసిన ఆయిల్‌పామ్ మొక్కలను సరగారెడ్డి కలెక్టర్ గురువారం పరిశీలించారు. వనమహోత్సవంలో భాగంగా కొత్తూరు(డి)లో ఆయిల్‌పామ్ మొక్కలను నాటారు.

లింగంపల్లి గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్

మునిపల్లి : మండల పరిధిలోని లింగంపల్లి గురుకుల పాఠశాలను సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లలు రోడ్లపైకి వచ్చి ధర్నా చేయడం, పాఠశాల ఆవరణ అపరిశుభ్రంగా ఉండడంపై ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్డీవో వసంతరాణి, రాజు, తహసీల్దార్ ఆశాజ్యోతి, ప్రిన్సిపాల్ సురభి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

బోధన్- బీదర్

రైల్వే లైన్‌కు నిధులివ్వండి

పార్లమెంట్‌లో ప్రస్తావించిన జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్

నారాయణఖేడ్, ఆగస్టు 1: బోధన్-బీదర్ రైల్వేలైన్ పనులకు నిధులు మంజూరు చేయాలని జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ గురువారం పార్లమెంట్‌లో ప్రభుత్వాన్ని కోరారు. తాను పది సంవత్సరాల క్రితం ఎంపీగా ఉన్నప్పుడు బోధన్-బీదర్ రైల్వేలైన్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు చేయించానని, అప్పటి ప్రభుత్వం రైల్వేలైన్ కోసం సర్వే కూడా చేయించిందని పేర్కొన్నారు. అప్పటి నుంచి ఈ విషయంలో పురోగతి లేదని ఆవేదన వ్యక్తంచేశారు. బోధన్-బీదర్ రైల్వేలైన్ నిర్మిస్తే బాన్సువాడ, పిట్లం, నారాయణఖేడ్ ప్రాంతాలవారితో కర్ణాటకలోని బీదర్, గుల్బర్గ ప్రాంతాల ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ఈ రైల్వేలైన్ వల్ల మూడు రాష్ట్రాలకు చెందిన వేలాది మంది ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రలకు అనుసందానంగా ఉంటుందని, సమీపంలోనే నిజాంసాగర్ ప్రాజెక్టు ఉన్నందున ఆయకట్టు రైతులు వ్యవసాయ ఉత్పత్తులను కూడా తరలించుకోవడానికి ఉపయోగపడుతుందని తెలియజేశారు. ఇంత కీలకమైన బోధన్, బీదర్ రైల్వేలైన్‌కు చర్యలు ఆయన కోరారు.



పార్లమెంట్‌లో మాట్లాడుతున్న ఎంపీ సురేష్ షెట్కార్



బీఆర్‌ఎస్ నిరసనలు 8లో

క్రేన్ ఢీకొని మహిళ మృతి

రివర్స్ చేస్తుండగా ప్రమాదం

పటాన్‌చెరు, ఆగస్టు 1: రెండు వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమా దాల్లో ఇద్దరు మహిళలు మృత్యువాతపడ్డారు. ఈయర్‌ఫోన్ పెట్టుకుని వెళ్తున్న ఓ మహిళను రివర్స్ తీస్తున్న క్రేన్ ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మరో ప్రమాదంలో దంపతులు వెళ్తున్న ద్విచక్రవాహనా న్ని టిప్పర్ ఢీ కొట్టడంతో మరో మహిళ చనిపోయింది.

రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఓ మహిళను రివర్స్‌లో వస్తున్న క్రేన్ ఢీ కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటన పటాన్‌చెరులో గురువారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలో జాతీయ రహదారి పక్కన ఉన్న ఓ సూపర్ మార్కెట్‌లో పని చేసే అఖిల స్నేహితురాలిలో కలిసి విధులు నిర్వహించేందుకు నడుచుకుంటూ వెళ్తోంది. ఈ క్రమంలో జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులో ఓ భారీ క్రేన్‌ను డ్రైవర్ గమనించకుండా రివర్స్ తీయడంతో చక్రాల కింద పడి అఖిల అక్కడికక్కడే దుర్మరణం పాలైంది. అఖిల కూడా ఇయర్ ఫోన్ పెట్టుకుని ఉండటంతో క్రేన్ శబ్దం వినిపించక పోవడంతో ప్రమాదం జరిగినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. క్రేన్ డ్రైవర్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మరో మహిళ..

రామచంద్రాపురం, ఆగస్టు 1: రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం చెందిన ఘటన రామచంద్రాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బీరంగూడకు చెందిన నిర్మల(52), సునీల్ దంపతులు గురువారం తెల్లవారు జామున లింగంపల్లి రైల్వేస్టేషన్ వైపు బైక్‌పై బయలు దేరారు. రామచంద్రాపురం పోలీస్‌స్టేషన్‌కు చేరుకోగానే వెనుక నుంచి వేగంగా వస్తున్న టిప్పర్ వీరి బైక్‌ను ఢీ కొంది. ఈ ఘటనలో నిర్మలపై నుంచి టిప్పర్ వెళ్లడంతో చక్రాల కిందిపడి నలిగిపోయింది. ఆమె భర్తకు కాలు విరిగింది. ఈ మేరకు రామచంద్రాపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గీతంలో వ్యర్థాల నిర్వహణపై అంతర్జాతీయ సదస్సు

పటాన్‌చెరు రూరల్, ఆగస్టు 1: వ్యర్థాల నిర్వహణ, వృత్తాకార ఆర్థిక వ్యవస్థ, ఐపీఎల్ అంతర్జాతీయ ఫోరమ్ 2024పై 14వ అంతర్జాతీ య సదస్సును గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ నిర్వహించనుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న నిపుణులతో చర్చలు, విజ్ఞాన భాగస్వామ్యాన్ని సులభతరం చేయడానికి ఈ ఏడాది నవంబర్ 28 నుంచి డిసెంబర్ 1 వరకు హైబ్రీడ్ విధానంలో ఈ సదస్సు నిర్వ హించనున్నట్లు వర్సిటీ అధికారులు గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఆసక్తిగల వారు సెప్టెంబర్ 15వ తేదీ లోపు నిర్ధిష్ట ప్రవేశ రుసుము చెల్లించి వ్యక్తిగతంగా కానీ, ఆన్‌లైన్‌లో కానీ హాజరు కావచ్చునన్నారు. మరిన్ని వివరాల కోసం సదస్సు చెర్మన్ ప్రొఫెసర్ సాధన కె.ఘోష్, నిర్వాహకుడు డాక్టర్ ఫైనెల్. పీ. థోరన్‌లను సంప్రదించాలని సూచించారు.

ఆగస్టు, సెప్టెంబరులోనూ జోరు వానలు!

» భారత వాతావరణ శాఖ అంచనా

విశాఖపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాల సీజన్‌లో తొలి అర్థభాగం మంచి వర్షాలు కురిశాయి. అదేజోరు ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కొన సాగనుంది. రెండు నెలల్లో దేశంలోని అనేక ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే ఎక్కువ వర్షపాతం (దీర్ఘకాలిక సగటులో 106 శాతం) నమోదవుతుంది. అయితే ఈశాన్య రాష్ట్రాలు, తూర్పు భారతంలో కొన్ని ప్రాంతాలు, సౌరాష్ట్ర, లద్దాక్, మధ్య, దక్షిణ భారతంలో కొన్ని ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే తక్కువ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఆగస్టు నెలలో ఈశాన్య రాష్ట్రాలు, వాయవ్య, మధ్య, తూర్పు, దక్షిణాదిలో పలు భాగాలు, కశ్మీర్, లద్దాక్ వంటి ప్రాంతాలు తప్ప దేశంలో మిగిలిన ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుంది. ఈ మేరకు ఆగస్టు, సెప్టెంబరు నెలలకు సంబంధించి ముందస్తు అంచనా నివేదికను వాతావరణ శాఖ గురువారం విడుదల చేసింది.

ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో దేశంలో 422.8 మి.మీ వర్షపాతం (1971 నుంచి 2020 వరకు నమోదైన వర్షపాతం సగటులో 106 శాతం) నమోదవుతుందని తాజా బులెటిన్‌లో పేర్కొంది. ఆగస్టులో దేశంలో 254.9 మి.మీ. (1971 నుంచి 2020 వరకు నమోదైన వర్షపాతం సగటులో 94 నుంచి 106 శాతం వరకు) నమోదు కానుంది. ఆగస్టులో దక్షిణాది రాష్ట్రాల్లో తప్ప దేశంలోని అనేక ప్రాంతాల్లో గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయని తెలిపింది. కాగా, ఆగస్టులో దక్షిణ కోస్తా, సీమల్లో ఎక్కువ, ఉత్తర కోస్తాలో తక్కువ వర్షాలు ఆగస్టు నెలలో దక్షిణ కోస్తా, రాయలసీమల్లో సాధారణం, అంతకంటే ఎక్కువ వర్షాలు కురవనున్నాయి. ఉత్తర కోస్తాలోని ఎక్కువ ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే తక్కువ వర్షాలు కురుస్తాయి. ఉత్తర తెలంగాణ, ఉత్తర కోస్తాలతోపాటు, దక్షిణ ఛత్తీస్‌గఢ్‌లో సాధారణం కంటే తక్కువ వర్షాలు కురవనున్నాయని వాతావరణ శాఖ అంచనా వేసింది.

ఇది జాతీయ విపత్తే

మా నాన్నను కోల్పోయినప్పటి పరిస్థితి గుర్తుకొచ్చింది: రాహుల్‌గాంధీ

» సోదరి ప్రియాంకతో కలిసి.. ముండక్కై, చురాల్‌మలలో పర్యటన

» జాతీయ విపత్తుగా ప్రకటించాలి: పినరయి

» 289కి పెరిగిన మరణాలు

వయనాడ్, ఆగస్టు 1: "వయనాడ్‌లో తీవ్ర విషాదం నెలకొంది. ఆ దృశ్యాలు హృదయాన్ని తీవ్రంగా గాయపరుస్తున్నాయి. నాకు ఏం చెప్పాలో తెలియడం లేదు. మా నాన్న చనిపోయినప్పుడు ఎలా ఉండేదో.. ఇప్పుడు అలాంటి బాధనే ఎదుర్కొంటున్నాను. నా దృష్టిలో ఇది జాతీయ విపత్తే" అని లోక్‌సభలో విపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ ఉద్వేగంతో అన్నారు. గురువారం ఆయన తన సోదరి ప్రియాంక గాంధీతో కలిసి వయనాడ్‌లో కొండచరియల బాధిత ప్రాంతాలు-- ముండక్కై, చురాల్‌మల, అట్టమల, మెప్పాడిలో పర్యటించారు. ఈ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పునరావాస శిబిరాల్లో, ఆస్పత్రుల్లో బాధితులతో మాట్లాడారు. "దేశం మీ వెన్నంటే ఉంది.." అంటూ వారికి ధైర్యం చెప్పారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఇది బాధాకరమైన పరిస్థితి అని.. పినరయి ప్రభుత్వం బాధితులకు అన్ని విధాలా సాయం చేయడానికి కట్టుబడి ఉందని చెప్పారు. ముందే హెచ్చరించామంటూ లోక్‌సభలో హోంమంత్రి అమిత్‌షా చేసిన ప్రకటన గురించి విలేకరులు ప్రస్తావించగా.. "ఇది రాజకీయ ఘర్షణకు సమయం కాదు. అన్ని వ్యవస్థలు కలిసికట్టుగా పనిచేయాల్సిన తరుణమిది" అని వ్యాఖ్యానించారు. కరోనా కష్టకాలంలో తాను, ప్రియాంక వయనాడ్ ప్రజలకు అండగా ఉన్న విషయాన్ని గుర్తు చేస్తూ.. ఇప్పుడు కూడా సహాయక చర్యలు, పునరావాస కార్యక్రమాలను నిశితంగా పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. అనంతరం ఇదే విషయాన్ని తన ఎక్స్, ఫేస్‌బుక్ ఖాతాల్లో పోస్ట్ చేశారు. మరోవైపు కేరళ సీఎం పినరయి విజయన్ కూడా వయనాడ్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 280కి పైగా పౌరులు చనిపోయారని, కేంద్రం జాతీయ విపత్తుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. జాతీయ విపత్తుగా ప్రకటించడానికి అభ్యంతరం ఏంటని ప్రశ్నించారు. సహాయక చర్యల్లో పాల్గొంటున్న సైన్యం, రెస్క్యూ వర్కర్లు, స్థానికులను ఆయన అభినందించారు. ఆర్మీ జాగిలాలు మృతదేహాలను గుర్తిస్తున్నాయని, నదిలో కొట్టుకుపోయిన శరీర భాగాలను వెలికితీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. కాగా.. కొండచరియలు విరిగిపడ్డ ఘటనల్లో మృతుల సంఖ్య 289కి పెరిగినట్లు అధికారులు వివరించారు. గల్లంతైన వారి ఆచూకీ తెలుసుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు.


పునరావాస శిబిరంలో బాధితులను ఓదారుస్తున్న రాహుల్, ప్రియాంక

డార్క్ టూరిజం వద్దు

వయనాడ్‌లో డార్క్ టూరిజానికి రావొద్దంటూ కేరళ పోలీసులు సామాజిక మాధ్యమాల్లో విజ్ఞప్తి చేశారు. దీంతో.. 'డార్క్ టూరిజం' అనే పదం వైరల్‌గా మారింది. 'చెర్నోబిల్ అండ్ ది డార్క్ టూరిస్ట్' టీవీ షోతో ఈ పదం బాగా పాపులర్ అయింది. మరణం, విషాదం, హింస చోటుచేసుకుని, అసాధారణ పరిస్థితులు ఉండే ప్రదేశాలను సందర్శించడాన్ని డార్క్ టూరిజం అంటారు. ఉదాహరణకు ఉక్రెయిన్‌లోని చెర్నోబిల్ (అణు విద్యుత్తు కేంద్రం) ఘటన, కాంబోడియాలో కిల్లింగ్ ఫీల్డ్స్, పోలెండ్‌లోని అష్విట్జ్ క్యాంప్ వంటివి డార్క్ టూరిజం కిందకు వస్తాయి. ఇప్పుడు వయనాడ్‌కు డార్క్ టూరిస్టులు వస్తే.. సహాయక చర్యలకు ఆటంకాలేర్పడతాయని కేరళ పోలీసులు ఆందోళన వ్యక్తం చేశారు.

హమా‌స్‌కు భారీ దెబ్బ!

» ఇజ్రాయెల్‌పై దాడుల వ్యూహకర్త మిలిటరీ చీఫ్ డెయిఫ్ హతం!

» జూలై 13న గాజాలో అంతం చేశాం

» ప్రకటించిన ఇజ్రాయెల్ సైన్యం

» ఆ ప్రకటనను ఖండించిన హమాస్

జెరూసలెం, ఆగస్టు 1: హమా‌స్‌కు మరో భారీ దెబ్బ తగిలింది. ఇరాన్ రక్షణలో ఉన్న హమాస్ చీఫ్ ఇస్మాయిల్ హనియా హత్యకు గురైన మరునాడే హమాస్ మిలిటరీ చీఫ్, ఇజ్రాయెల్‌పై దాడుల వ్యూహకర్త మహమ్మద్ డెయిఫ్ హతమయ్యాడు. డెయిఫ్‌ను తమ సైన్యం అంతం చేసినట్టు ఇజ్రాయెల్ గురువారం అధికారికంగా ప్రకటించింది. తన ప్రకటనలో ఆపరేషన్ వివరాలను వెల్లడించింది. "మా సైన్యం (ఐడీఎఫ్) గత నెల 13న గాజాలోని ఖాన్ యూనిస్ ప్రాంతంపై జెట్లతో దాడి చేసింది. అక్కడ హమా‌స్‌కు చెందిన డిప్యూటీ కమాండరు నివాసంలో డెయిఫ్ ఉన్నట్టు గుర్తించాం. అక్కడ జెట్లతో బాంబులు ప్రయోగించాం. ఈ దాడిలో డెయిఫ్ హతమయ్యాడు" అని ఆ ప్రకటనలో తెలిపింది. గత ఏడాది అక్టోబరు ఏడున ఇజ్రాయెల్ భూభాగంపై జరిగిన దాడుల ఆలోచన, ప్రణాళిక, అమలు అంతా డెయిఫ్ నేతృత్వంలో జరిగిందని ఇజ్రాయెల్ ఆరోపిస్తోంది. ఈ దాడుల్లో 1197 మంది ఇజ్రాయెల్ పౌరులు చనిపోయారు. కాగా, డెయిఫ్ మరణవార్తపై హమాస్ స్పందించింది. ఖాన్ యూని‌స్‌పై జూలైలో ఇజ్రాయెల్ దాడులు చేసిన మాట నిజమేనని, అందులో 90మంది చనిపోయారని, మృతుల్లో డెయిఫ్ లేరని గాజాలోని హమా‌స్‌కు చెందిన ఆరోగ్య వర్గాలు ధ్రువీకరించాయి.

కర్ణాటక సీఎంకు గవర్నర్ నోటీసుపై మంత్రివర్గం అభ్యంతరం

» వెనక్కి తీసుకోవాలని ఏకగ్రీవ తీర్మానం

బెంగళూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార(ముడా) ఇంటి స్థలాల కేటాయింపు అవినీతి వ్యవహారంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ నోటీసులు జారీ చేయడంపై మంత్రి వర్గం తీవ్ర అభ్యంతరం తెలిపింది. విధానసౌధలో గురువారం సీఎం సిద్దరామయ్య లేకుండా డీసీఎం డీకే శివకుమార్ అధ్యక్షతన క్యాబినెట్ భేటీ జరిగింది. ముడా అవినీతికి సంబంధించి గవర్నర్ జారీ చేసిన నోటీసులు వాపసు తీసుకోవాలని క్యాబినెట్‌లో ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ విషయాన్ని సహకార శాఖ మంత్రి రాజణ్ణ మీడియాకు తెలిపారు. సీఎం సిద్దరామయ్యకు రాజభవన్ నుంచి వచ్చి న షోకాజ్ నోటీసు గురించి చర్చించామని, న్యాయపోరాటం చేయాలని తీర్మానించామని చెప్పారు. గవర్నర్ జారీ చేసిన నోటీసును వాపసు తీసుకోవాలని క్యాబినెట్‌లో తీర్మానించామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రికి గవర్నర్ నోటీసు జారీ చేయడం రాజకీయ ప్రేరేపితమని ఆరోపించారు. నోటీసులు తిరస్కరించాలని నిర్ణయం తీసుకున్నామని ఆయన తెలిపారు.

ఉత్తరాది అతలాకుతలం

» హిమాచల్‌లో క్లౌడ్ బరస్ట్‌తో కుంభవృష్టి!

» 50 మంది గల్లంతు.. ఐదుగురి దుర్మరణం

» ఉత్తరాఖండ్‌లో రాత్రివేళ పోటెత్తిన వరద

» రాష్ట్రవ్యాప్తంగా వర్షాలకు 12మంది మృతి

శిమ్లా, డెహ్రాడూన్, జైపూర్, ఆగస్టు 1: ఉత్తరాది రాష్ట్రాలను భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. ముఖ్యంగా హిమాచల్ ప్రదేశ్‌లో క్లౌడ్ బరస్ట్‌తో కులు, పధార్, మండి, శిమ్లా జిల్లాలను వరద ముంచెత్తింది. 50 మంది గల్లంతవగా.. వీరిలో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. ఇళ్లు, బ్రిడ్జిలు, రోడ్లు కొట్టుకుపోయాయి. దీంతో సహాయక చర్యలకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. శ్రీఖండ్ మహదేవ్ సమీపంలో బుధవారం రాత్రి క్లౌడ్ బరస్ట్‌తో సర్పారా, గాన్వీ, కుర్బన్ నల్లాల్లో మెరుపు వరదలు సంభవించాయి. పార్వతి నదిపై మలానా డ్యామ్ కొట్టుకుపోయి దిగువ ప్రాంతాలను నీరు ముంచెత్తింది. శిమ్లా జిల్లా రాంపూర్‌లోని సమేజ్‌ఖడ్‌లో 30 మంది కొట్టుకుపోయారు. వీరిలో ఇద్దరు మృతిచెందారు. మండి జిల్లా తెరాంగ్ సమీపంలోని రాజ్‌బన్ గ్రామం వద్ద మరో క్లౌడ్ బరస్ట్ జరిగింది. ఏడుగురు గల్లంతవగా ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. కులు జిల్లాలో ఏడుగురు కొట్టుకుపోయారు. మలానా జల విద్యుత్ కేంద్రంలో పలువురు చిక్కుకుపోయారు. బియాస్ నది ఉధృతి, కొండచరియలు విరిగిపడడంతో కీలకమైన మనాలీ-చండీగఢ్ జాతీయ రహదారి పలుచోట్ల తీవ్రంగా దెబ్బతిన్నది. కాగా, ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలతో రాత్రికి రాత్రే వరద పోటెత్తింది. పలు నదులు ప్రమాదకర స్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి. డెహ్రాడూన్‌లో పరిస్థితి తీవ్రంగా ఉంది. రాష్ట్రంలో మొత్తం 12 మంది మృతిచెందారు. హరిద్వార్‌లోనే ఆరుగురు చనిపోయారు. ఇక్కడ 21 సెం.మీ. వర్షపాతం న మోదైంది. కేదార్‌నాథ్ మార్గంలో 1,500 మంది యాత్రికులు చిక్కుకుపోయారు. వీరిలో 425 మందిని హెలికాప్టర్ ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఉత్తరాఖండ్, హిమాచల్‌లో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, సైన్యం, స్థానిక పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. దేశ రాజధాని ఢిల్లీలోని చాలా ప్రాంతాలు ఇంకా నీటిలోనే ఉన్నాయి. ఆరు చోట్ల ఒక్క రోజులోనే 10 సెం.మీ.పైగా వర్షపాతం నమోదైంది. వివిధ ఘటనల్లో ఐదుగురు చనిపోయినట్లు అధికారులు తెలిపారు. మరోవైపు రాజస్థాన్ రాజధాని జైపూర్‌ను వర్షాలు ముంచెత్తాయి. ఓ ఇంట్లోకి వరద చేరడంతో ఆరేళ్ల బాలిక సహా ముగ్గురు మృతిచెందారు. హిమాచల్, పంజాబ్, హరియాణా, ఢిల్లీ, ఉత్తరాఖండ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, గోవాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.


వర్షాలకు హిమాచల్‌ప్రదేశ్‌లోని మనాలీలో ధ్వంసమైన రోడ్డు

పార్లమెంట్ పైకప్పు లీకేజీ

» బీజేపీ ప్రభుత్వంపై ప్రతిపక్షాల మండిపాటు

» లీకేజీ స్వల్పమే.. పరిష్కరించాం: కేంద్రం

న్యూఢిల్లీ, ఆగస్టు 1: ఢిల్లీలో కురుస్తున్న భారీ వర్షాలకు కొత్త పార్లమెంటు భవనం పైకప్పు లీకవుతోంది. రూ.1,000 కోట్లకు పైగా ఖర్చు చేసి నిర్మించిన ఈ భవనం లాబీలోని గాజు పైకప్పు నుంచి కింద ఉంచిన బకెట్‌లోకి నీరు ధారగా పడుతున్న వీడియోను సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ సామాజిక మాధ్యమాల్లో షేర్ చేశారు. "కొత్త భవనం కంటే పాత భవనం చాలా మెరుగ్గా ఉంది. వర్షాకాల సమావేశాలను పాతదానిలో ఎందుకు నిర్వహించకూడదు. కనీసం కొత్తదానిలో నీరు కారడం ఆగిపోయే వరకైనా..' అంటూ వ్యంగాస్త్రాలు సంధించారు. ఈ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ప్రతి కొత్త భవనం పైకప్పు నుంచి నీరు లీకవడం.. బాగా ఆలోచించి రూపొందించిన డిజైన్‌లో భాగమా అని ప్రజలు అడుగుతున్నారని ఆయన బీజేపీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఈ వీడియోపై కాంగ్రెస్ ఎంపీ మాణిక్కం ఠాగూర్ స్పందించారు. "బయట పేపర్ లీక్.. లోపల వాటర్ లీక్.. నిర్మించిన ఏడాది పూర్తి కాకుండానే పార్లమెంట్ లాబీలో నీరు లీక్ కావడం కొత్త భవనంలో అత్యవసర పునరుద్ధరణ సమస్యలను ఎత్తి చూపుతోంది" అని ఎద్దేవా చేశారు. ఈ అంశంపై చర్చించడానికి ప్రస్తుత లోక్‌సభ సమావేశాల్లో ఆయన వాయిదా తీర్మానం ప్రవేశపెట్టారు. 'రూ.1,200 కోట్ల వ్యయంతో నిర్మించిన పార్లమెంట్ ఇప్పుడు రూ.120 బకెట్‌పై ఆధారపడి ఉంది' అని ఆమ్ ఆద్మీ పార్టీ ఎద్దేవా చేసింది. సెంట్రల్ విస్టా ప్రాజెక్టులో భాగంగా కొత్త పార్లమెంట్ భవనాన్ని 2023 మే 28న ప్రధాని మోదీ ప్రారంభించారు. కాగా, పైకప్పు గ్లాస్ డోమ్‌లకు ఏర్పాటుచేసిన పట్టీలు వదులుగా ఉండటంతో కొత్త పార్లమెంటు భవనం మకర ద్వారం వద్ద స్వల్పంగా నీరు లీకైందని లోక్‌సభ సెక్రటేరియట్ తెలిపింది. సకాలంలో సమస్యను గుర్తించి, వెంటనే మరమ్మతులు చేపట్టామని, అంతటితో నీరు కారడం ఆగిపోయిందని కేంద్ర ప్రభుత్వం వివరణ ఇచ్చింది.



ఉడకని అన్నం.. నీళ్ల చారు..

తినలేక పారేస్తున్న విద్యార్థులు - స్నానానికీ నీళ్లు కరువు - కౌడిపల్లి గురుకులం దుస్థితి

కౌడిపల్లి, ఆగస్టు 1: ఉడికీ ఉడకని అన్నం, నీళ్ల చారు.. స్నానం చేద్దామంటే నీళ్లు రావు. ఇదీ కౌడిపల్లిలోని తెలంగాణ గిరిజన బాలుర గురుకులం పరిస్థితి. నాలుగు రోజులుగా హాస్టల్‌కు మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో గురువారం విద్యార్థులు నిరసన తెలిపారు. తమ గోడును పట్టించుకునే వారే లేరని ఆవేదన వ్యక్తం చేశారు. కౌడిపల్లిలోని తెలంగాణ గిరిజన గురుకుల (బాలుర) పాఠశాలలో ఐదో తరగతి నుంచి ఇంటర్ వరకు 360 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ గురుకులంలో కొన్ని రోజుల నుంచి ఉడికీ ఉడకని అన్నం, నీళ్ల చారు వడ్డిస్తున్నారని.. అన్నం తినలేక చాలా మంది పారేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు రోజులుగా మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో కాలకృత్యాలు తీర్చుకునేందుకూ ఇబ్బందులు పడుతు న్నామన్నారు. స్నానం చేసేందుకు నీరు లేకపోవడంతో పంట పొలాల వద్దకు వెళ్తే ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఇప్పటికైనా అధికారు లు స్పందించి గురుకులంలో నాణ్యమైన భోజనం అందించాలని, మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.


అన్నం పారేస్తున్న విద్యార్థులు

ఉమ్మడి మెదక్ జిల్లా రిజిస్ట్రార్‌గా వల్లి సుబ్బలక్ష్మి

పటాన్‌చెరు సబ్ రిజిస్ట్రార్లుగా రవికాంత్, శ్రీనివాస్



కంది, ఆగస్టు 1: ఉమ్మడి మెదక్ జిల్లా రిజిస్ట్రార్‌గా వల్లి సుబ్బలక్ష్మి గురువారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా రిజిస్ట్రార్లను, సబ్ రిజిస్ట్రార్‌లను బదిలీ చేస్తూ స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్, ఇన్‌స్పెక్టర్ జనరల్ జ్యోతి బుద్ధ ప్రకాశ్ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. వల్లి సుబ్బలక్ష్మి హైదరాబాద్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి ఉమ్మడి మెదక్ జిల్లాకు బదిలీపై వచ్చారు. ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్‌గా పనిచేసిన ఎం.రవీందర్‌రావు హైదరాబాద్ సౌత్‌కు బదిలీ అయ్యారు. ఇదే కార్యాలయంలో ఉన్న పటాన్‌చెరు జాయింట్-1 సబ్ రిజిస్ట్రార్‌గా శేరిలింగంపల్లి నుంచి రవికాంత్, జాయింట్-2 సబ్ రిజిస్ట్రార్‌గా శంకర్‌పల్లి నుంచి శ్రీనివాస్‌లు బదిలీపై వచ్చారు. పటాన్‌చెరు జాయింట్-1 సబ్ రిజిస్ట్రార్‌గా కొనసాగిన హనుమంతరావు ఘట్‌కేసర్‌కు, జాయింట్-2 సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన షేర్ అలీ వికారాబాద్‌కు బదిలీ అయ్యారు. జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయ సిబ్బంది పాత అధికారులను సన్మానించి వీడ్కోలు పలికారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వారికి శుభాకాంక్షలు తెలిపారు.


కవి అందెశ్రీని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

తల్లిదండ్రులు, గురువులను గౌరవించాలి : అందెశ్రీ

చేర్యాల, ఆగస్టు 1: జన్మనిచ్చిన తల్లిదండ్రులను, విద్యాబుద్ధులు నేర్పిన గురువులను గౌరవించాలని కవి అందెశ్రీ అన్నారు. చేర్యాల మండలం నాగపురి జడ్పీఎస్ఎస్‌ను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యతోనే వివేకం వర్ధిల్లుతుందని, చదువును మించిన సంపద సృష్టిలో లేదన్నారు. అందెశ్రీని పాఠశాల హెచ్ ఎం అయిలయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు.

సుప్రీం తీర్పును అమలు చేయాలి: ప్రొఫెసర్ కాసీం

గజ్వేల్, ఆగస్టు 1: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును రెండు తెలుగు రాష్ట్రాలు అమలుపరచాలని ప్రొఫెసర్ కాసీం డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో గజ్వేల్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, విలేకరులతో మాట్లాడారు. ఈ తీర్పు మాదిగలకు అనుకూలం.. మాలలకు వ్యతిరేకంగా భావించవద్దని, మాల మేధావు లు స్పందించి మాల, మాదిగల మధ్య అగాధాన్ని తొలగించాలన్నారు. ఆయన వెంట ఎంఈఎఫ్ నాయకులు చేబర్తి యాదగిరి, లలిత, ఉప్పరిపల్లి నాగభూషణం, ఎంఎస్పీ రాష్ట్ర నాయకులు మైస రాములు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ముంద్రాతి కృష్ణ తదితరులున్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

అంగన్‌వాడీ కేంద్రాల్లో అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాలు.. గర్భిణులు, బాలింతలకు అవగాహన



కోహీర్: అంగన్‌వాడీల ఆధ్వర్యంలో చిన్నారులతో ర్యాలీ

కోహీర్ ఆగస్టు 1: తల్లిపాలే బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని ఆయా అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. బిడ్డకు రోగనిరోధక శక్తిని పెంచడంలో తల్లిపాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. శిశువు పుట్టిన అరగంటలోనే తల్లిపాలు పట్టించాలని, వాటినే ముర్రుపాలు అంటారని, ఇది ఒక టీకా వాక్సినేషన్ లాగా పనిచేస్తుందన్నారు. మొదటి 6 నెలల పాటు కేవలం తల్లిపాలే ఫీడింగ్ ఇవ్వాలని, అనంతరం తల్లిపాలతో పాటు ఘనపదార్థం ఇస్తూ 2 సంవత్సరాల వరకు తల్లిపాలు తప్పక పట్టాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్లు శాంతి లక్ష్మి, మమత, రేణుక అంగవాడీ టీచర్లు, తల్లులు, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.

● కంది : తల్లి పాలతోనే బిడ్డలకు రోగనిరోధక శక్తి పెరుగుతుందని కంది పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ సాయి శంకర్ అన్నారు. కందిలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు తల్లిపాలలోని పోషక విలువలపై మెడికల్ ఆఫీసర్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విశ్వనీత, టీచర్ శోభారాణి, ఆయ లావణ్య పాల్గొన్నారు.

●పెద్దశంకరంపేట: మండలకేంద్రంలోని పూసల గల్లి అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాధాన్యంపై ఐసీడీఎస్ సూపర్ వైజర్ భాగ్యమ్మ అవగాహన కల్పించారు. పుట్టిన వెంటనే పిల్లలకుతల్లిపాలు ఇవ్వాలని ఆమె వారికి సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సరళ పాల్గొన్నారు.



కంది: వారోత్సవాల్లో మాట్లాడుతున్న పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సాయిశంకర్

● నిజాంపేట: అప్పుడే పుట్టిన శిశువుకు ముర్రుపాలు తాగిస్తే రోగ నిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా ఎదుగుతారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో గల అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో మొదటి రోజు ర్యాలీ నిర్వహించి తల్లిపాల ప్రాముఖ్యంపై వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ నర్సింహులు, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు అరుణ, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

● చిలప్‌చెడ్: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ 1వ కేంద్రంలో తల్లి పాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోషిమాత మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం ఆగస్టు 1 నుంచి 8వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. పిల్లలకు ముర్రుపాలు పట్టించడం వల్ల రోగ నిరోధకశక్తి పెరుగుతుందని గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ ప్రశాంతి, స్వరూప, శ్వేత, పిల్లల తల్లులు పాల్గొన్నారు.



నిజాంపేట: తల్లిపాల విశిష్టతపై విద్యార్థులతో ర్యాలీ

● వెల్దుర్తి: మండల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీ టీచర్లు తల్లిపాలపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వరలక్ష్మి మాట్లాడుతూ.. బిడ్డ పుట్టగానే ముర్రుపాలు తాగించడం వల్ల బిడ్డకు ఎంతో ఆరోగ్యమన్నారు. 6నెలల వరకు బిడ్డకు కేవలం తల్లిపాలు మాత్రమే పట్టించాలని తెలిపారు.

● మాసాయిపేట: మండలంలోని కొప్పులపల్లి గ్రామంలో గల రెండో అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం తల్లిపాల వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాధవి ఆధ్వర్యంలో బాలింతలు, గర్భిణులకు తల్లిపాల ప్రాముఖ్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామంలోని మహిళలు, గర్భిణులు మాజీ సర్పంచ్ కనకమ్మ, బాల్‌రెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.



మాసాయిపేట: కొప్పులపల్లిలో తల్లిపాల వారోత్సవాలు

● పాపన్నపేట: పిల్లలు ఆరోగ్యంగా ఎదగడానికి తల్లిపాలు ఎంతో దోహదపడుతాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని బాచారం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు తల్లిపాల విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మంగ, సంధ్యారాణి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

● మునిపల్లి: మండలంలోని చిన్నచెల్మడ అంగన్‌వాడీ టీచర్ మీనాక్షి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ ఆయా, పిల్లల తల్లులు, పిల్లలు తదితరులు ఉన్నారు.

ఆర్అండ్‌బీ డీఈగా రామకృష్ణ

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 1: రోడ్లు భవనాల శాఖ(ఆర్అండ్‌బీ) సంగారెడ్డి సబ్‌డివిజన్ డీఈగా కె.రామకృష్ణ నియమితులయ్యారు. ఆర్అండ్‌బీ జాతీయ రహదారుల డీఈగా పనిచేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ మేరకు గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డీఈగా పనిచేసిన రవీందర్ అందోల్‌కు బదిలీ అయ్యారు.

నేటి సీఎం మీట్‌కు సంగారెడ్డి జిల్లా నుంచి 928 మంది

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 1: హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో ఇటీవల పదోన్నతి పొందిన ఉపాధ్యాయు ల తో ఈ నెల 2న సీఎం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి జిల్లా నుంచి 928 మంది ఉపాధ్యాయులు వెళ్లనున్నారు. పదోన్నతి పొందినవారంతా సమావేశంలో పాల్గొనేలా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

పరిశ్రమపై చర్యలు తీసుకోండి

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 1: కాలుష్యం వెదజల్లుతూ పంటలతో పాటు మంజీర నీటిని కలుషితం చేస్తున్న రసాయన పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహులు, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అశోక్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అనిల్, వృత్తి సంఘాల జిల్లా నాయకుడు రమేష్‌గౌడ్ డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కార్యాలయం ఎదుట గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సదాశివపేట మండల ఆరూర్ గ్రామ సమీపంలోని ఎవరెస్ట్ ఆర్గానిక్స్ పరిశ్రమ వెదజల్లే కాలుష్య జలాల వల్ల పెద్ద గోపులారం, ఆరూర్, కోనాపూర్, నాగులపల్లి, ఆత్మకూర్ కాలువల నుంచి మంజీరా నదిలో కాలుష్య జలాలు చేరి పంటలు ఎండిపోతున్నాయని, మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయన్నారు. సదరు పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

రేపు బాలికల గురుకులంలో స్పాట్ అడ్మిషన్లు

నర్సాపూర్, ఆగస్టు 1: మండలంలోని నారాయణపూర్ సమీపంలో ఉన్న బాలికల గిరిజన గురుకులంలో 5వ తరగతి నుండి 9వరకు, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈ నెల 3వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు గురుకులం ప్రిన్సిపాల్ లలితాదేవి పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం 8333925388ను సంప్రదించాలన్నారు.

రుణమాఫీ రానివారికి గ్రీవెన్స్ సెల్

మాసాయిపేట, ఆగస్టు 1: జిల్లాలో రైతు రుణమాఫీ పొందని రైతుల కోసం రైతు వేదికల్లో ప్రత్యేక గ్రీవెన్స్ సెల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ తెలిపారు. గురువారం మాసాయిపేట మండలంలోని కొప్పులపల్లి గ్రామంలో రుణమాఫీ అందని రైతులతో ఆయన మాట్లాడారు. గ్రామంలో గల వ్యవసాయ పంట పొలాలను వరి చేలను పొలాల వెంట తిరిగి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రుణమాఫీ పొందని రైతులు తమ ఎట్టా పాసు బుక్‌తో సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించి తమ దరఖాస్తులను అందజేయాలన్నారు. అలాగే మాసాయిపేట లోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను కొడిపల్లి వ్యవసాయ శాఖ జేడీ పుణ్యవతి తనిఖీ చేశారు.

ప్రభుత్వ పాఠశాలల పరిశీలన

రామాయంపేట, ఆగస్టు1: పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలను జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పరిశీలించారు. శిథిలావస్థకు చేరిన ఆ భవనాలను మరో చోటికి మార్చేందుకు డీఈవో రాధాక్రిష్ణతో పాటు ఆయన చర్చించారు. గురువారం వారు మొదట ఇక్కడి బాలుర హైస్కూల్‌ను సందర్శించి సందర్శించి పెచ్చులూడుతున్న భవనాన్ని పరిశీలించారు. ఇక్కడి పిల్లలను మరో భవనంలోకి మార్చేందుకు ప్రస్తుతం ఖాళీగా ఉన్న బీసీ హాస్టల్‌ను చూశారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు పట్ల హర్షాతిరేకాలు

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు వెలువరించిన తీర్పును స్వాగతిస్తూ సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సంబురాలు జరుపుకోగా, బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 1: ఫోరం ఫర్ బెటర్ సంగారెడ్డి అధ్యక్షుడు శ్రీధర్ మహేంద్ర ఆధ్వర్యంలో నాయకులు సంగారెడ్డిలోని అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ ఉద్యమం భారతదేశ సామాజిక ఉద్యమాల చరిత్రలో నిలిచిపోతుందన్నారు. మంద కృష్ణ మాదిగతో పాటు ఇతర సంఘాల మేధావులకు ఉద్యమకారులకు అభినందనలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో ఫోరం ఉపాధ్యక్షుడు సజ్జద్ ఖాన్, ప్రధాన కార్యదర్శి పురం మహేష్‌కుమార్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

● పెద్దశంకరంపేట: మండలకేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలోమండల బీజేపీ అధ్యక్షుడు కోణం విఠల్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ హయాంలో ఎస్సీల వర్గీకరణ కల సాకారమైందని హర్షం వ్యక్తం చేశారు. సమావేశంలో మండల బీజేపీ నాయకులు,మాజీసర్పంచులు పాల్గొన్నారు.

● చిన్నశంకరంపేట: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తూ చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని ఎమ్మార్పీఎస్ నాయకులు సంబురాలు జరుపుకొని టపాకాయలు పేల్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర జిల్లా నాయకులు పాల్గొన్నారు. కాగా మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి స్థానిక విలేకరులతో మాట్లాడుతూఎస్సీ సంవత్సరాలుగా ఎస్సీ వర్గీకరణకు పోరాటం చేస్తున్న తుది దశకు చేరిందని, సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నామన్నారు.

● మాసాయిపేట: ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు ధర్మాసనం అనుకూలంగా తీర్పు ఇవ్వడం పట్ల మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు యాదగిరి మాదిగ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో పెద్ద ఎత్తున టపాసులు కాలుస్తూ సంబురాలు జరుపుకున్నారు.

● మనోహరాబాద్: మండల కేంద్రంలోని చౌరస్తా వద్ద మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు సుధాకర్ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కోర్టు తీర్పును స్వాగతిస్తూ మందకృష్ణ మాదిగ ఫ్లెక్సీలతో అభినందనలు తెలియజేశారు. ఈ విజయంతో మాదిగ ఉపకులాలు ముందడుగు వేస్తాయని ఆకాంక్షించారు.

● నర్సాపూర్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఎస్సీల వర్గీకరణ కోసం అవిశ్రాంతంగా పోరాడి వర్గీకరణ సాధనకు కృషి చేసిన మంద కృష్ణమాదిగను ఢిల్లీలో నర్సాపూర్ బీజేపీ నాయకులు కలిసి శాలువాతో సత్కరించి అభినందించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు మురళీధర్‌యాదవ్, అసెంబ్లీ కన్వీనర్ రమణారావులు మందకృష్ణను కలిసి ప్రత్యేకంగా అభినందించారు. నర్సాపూర్ దళిత నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

● నిజాంపేట: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పు ఒక చరిత్రాత్మకమని ఎమ్మార్పీఎస్ నాయకులు పేర్కొన్నారు. మండల కేంద్రంలో గురువారం రోజున సుప్రీంకోర్టు తీర్పుపై కృతజ్ఞతలు తెలియజేస్తూ అంబేడ్కర్, మందకృష్ణ మాదిగ, సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్ రావు, చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వీట్లు పంచుకున్నారు.

బీఆర్ఎస్ నిరసనలు





సంగారెడ్డి, మెదక్ జిల్లా కేంద్రాల్లో దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సంగారెడ్డి రూరల్/జహీరాబాద్ ఆగస్టు 1: అసెంబ్లీలో మాజీ మహిళా మంత్రులు, ఎమ్మెల్యేలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సీఎం బేషరతుగా క్షమాపణలు చెప్పాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సూచనలతో గురువారం సంగారెడ్డిలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు విజయలక్ష్మి, శ్రావణ్, కొండాపూర్ మండలం బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మ్యాకం విఠల్, గోవర్ధన్‌రెడ్డి, విఠల్, రుక్కుద్దిన్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా జహీరాబాద్ పట్టణంలో రహదారిపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు రహదారిపై సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. సీఎం తన వ్యాఖ్యలను వెంటనే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఇప్పెపల్లి పీఏసీఎస్ చైర్మన్ మశ్చందర్, పార్టీ మండల శాఖ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

● మెదక్ మున్సిపాలిటీ/నర్సాపూర్, ఆగస్టు 1: బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై సీఎం చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ జిల్లా కేంద్రమైన మెదక్ పట్టణంలో బీఆర్ఎస్ నాయకులు ఆందోళనకు దిగారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి దిష్టిబొమ్మలను దహనం చేశారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు, మున్సిపల్ వైస్‌చైర్మన్ మల్లిఖార్జున్‌గౌడ్, కౌన్సిలర్లు, నాయకులు గడ్డమీది కృష్ణాగౌడ్, ఆకిరెడ్డి కృష్ణారెడ్డి, వంజరి జయరాజ్ తదితరులు ఉన్నారు. కాగా సీఎం చేసిన అనుచిత వ్యాఖ్యలపై శాసనసభ సాక్షిగా క్షమాపణలు చెప్పాలని మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి డిమాండ్ చేస్తూ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. అధికారం శాశ్వతం కాదన్న విషయాన్ని గుర్తెరగాలన్నారు. నర్సాపూర్‌లో జాతీయ రహదారిపై బీఆర్ఎస్ నాయకులు రాస్తారోకో చేసి సీఎం, డిప్యూటీసీఎం దిష్టిబొమ్మలను దహనం చేశారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా బస్టాండు వరకు వచ్చి మెదక్-హైదరాబాద్ జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. అనంతరం సీఎం, డిప్యూటీ సీఎం దిష్టిబొమ్మలను దహనం చేశారు. కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, మాజీ జడ్పీకో ఆప్షన్ మన్సూర్, ఎమ్మెల్యే సునీతారెడ్డి కుమారులు యువజన నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ నయిమోద్దిన్, మాజీ జడ్పీటీసీ బబియానాయక్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యుత్ సరఫరాకు చర్యలు

● పటాన్‌చెరు డివిజన్ ట్రాన్స్‌కో డివిజనల్ ఇంజనీర్

పటాన్‌చెరు, ఆగస్టు 1: మెరుగైన, నాణ్యమైన నిరంతర విద్యుత్ సరఫరాకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని ట్రాన్స్‌కో పటాన్‌చెరు డివిజనల్ ఇంజనీర్ ఎల్.భాస్కర్‌రావు పేర్కొన్నారు. గురువారం కిష్టారెడ్డిపేట సబ్‌స్టేషన్ పరిధిలోని అమీన్‌పూర్ మున్సిపల్ బీరంగూడ గ్రీన్‌మీడోస్ కాలనీలో విద్యుత్ సమస్యలపై ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన కాలనీవాసుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. కాగా విద్యుత్ సరఫరాలో ఎలాంటి అవాంతరాలు ఏర్పడటం లేదని కాలనీవాసులు సంతృప్తి వ్యక్తం చేశారు. సదస్సులో ఏడీ దుర్గాప్రసాద్, ఏఈ మనికంఠ, స్థానిక నాయకులు ఏనుగుశ్రీనివాస్ రెడ్డి, రఘుపతిరెడ్డి, కాలనీ సంక్షేమసంఘం నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను పరిశీలించిన ట్రైనీ కలెక్టర్

జోగిపేట, ఆగస్టు 1: ఆందోల్ మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ట్రైనీ కలెక్టర్ మనోజ్ పర్యటించి జాతీయ ఉపాధిహామీ పనులను పరిశీలించారు. మండలంలోని మన్సాన్‌పల్లి, రోళ్లపహాడ్ చింతకుంట, డాకూర్ తదితర గ్రామాల్లో ఈజీఎస్ ద్వారా చేపట్టిన ఫీడర్ చానల్ పనులను, రోడ్డు నిర్మాణం, వన నర్సరీలను, క్రీడాప్రాంగణాలను, బృహత్ పల్లెప్రకృతి వనాలు, మొక్క పెంపకం తదితర వాటిని ఆయా శాఖల అధికారులతో కలసి పరిశీలించారు. ఈయన వెంట మండల ప్రత్యేక అధికారి గీత, ఎంపీడీఓ రాజేష్‌కుమార్, ఎంపీఓ అశోక్, టీఏలు తదితరులు ఉన్నారు.

సోలక్‌పల్లిలో ఫైలేరియాపై అవగాహన

జిన్నారం, ఆగస్టు 1: మండలంలోని సోలక్‌పల్లిలో ఫైలేరియాపై డాక్టర్ల బృందం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గురువారం సోలక్‌పల్లిలో జిన్నారం పీహెచ్‌సీ, ఢిల్లీ డాక్టర్ల బృందానికి చెందిన జోనల్ డైరెక్టర్ డాక్టర్ విజయ్‌కుమార్, పీహెచ్‌సీ డాక్టర్ కోమల్‌తారక్‌ల ఆధ్వర్యంలో ఎండీఏ ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో పలు నివాసాలను సందర్శించి, ఫైలేరియా, నులిపురుగుల నిర్మూలన, బోదకాలు, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కాగా జిన్నారం, బొల్లారం, గుమ్మడిదల, పటాన్‌చెరు, భానూర్, కానుకుంట పీహెచ్‌సీ పరిధిలో ఫైలేరియాపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో బాల్‌రాజ్, ఆశవర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సాహితి ఆస్పత్రిలో ఉచిత హెల్త్ క్యాంపు



రాము సాహితి

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 1 : సంగారెడ్డి పట్టణంలోని రైతు బజార్ ఎదురుగా ఉన్న సాహితి హాస్పిటల్‌లో ఈ నెల 2వ తేదీన ఉచిత హెల్త్ క్యాంపు నిర్వహించనున్నట్లు ఆస్పత్రి ఎండీ రాము సాహితి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యూరో, ఆర్థో, డయాబెటిక్ వ్యాధులకు క్యాంపు ద్వారా వైద్య సేవలందించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు క్యాంపు ఉంటుందని పట్టణ, పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీజనల్ వ్యాధులు రాకుండా అరికడదాం

● జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి లలితకుమారి

కంది, ఆగస్టు 1: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అరికడదామని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి, కంది మండల ప్రత్యేకాధికారి లలితకుమారి పిలుపునిచ్చారు. మండలకేంద్రమైన కందిలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఆమె పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లలితకుమారి మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే అంటు వ్యాధులను అరికట్టవచ్చనన్నారు. గ్రామాల్లో చెత్త చెదారం ఎక్కపడితే అక్కడ పారబోయకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడివో శ్రీనివాస్, ఎంపివో మహేందర్ రెడ్డి, సూపరింటెండెంట్ వేణుగోపాల్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఐసీడీఎస్, హెల్త్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఘనంగా బోనాల పండుగ



పటాన్‌చెరు రూరల్: బోనాల ఊరేగింపులో నీలం మధు ముదిరాజ్, కాంగ్రెస్ నాయకులు

మనూరు, ఆగస్టు 1: మండల పరిధిలోని బోరంచ గ్రామంలో గురువారం ఘనంగా బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. తెలంగాణలో ప్రసిద్ధి గాంచిన బోరంచ నల్లపోచమ్మ ఆలయానికి గ్రామం నుంచి రెండుకిలో మీటర్ల దూరంలో ఉన్న ఆలయం వరకు ఊరేగింపుగా వెళ్లి బోనం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి సతీమణి అనుమ్మరెడ్డి, డీసీసీ ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులుపాల్గొన్నారు.

● జోగిపేట: జోగిపేటలోని శ్రీ వేణుగోపాలస్వామి మందిరంలో గురువారం క్రాంతియూత్ ఆధ్వర్యంలో మహంకాళి అమ్మవారి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మందిరం ఆవరణలో మహంకాళి అమ్మవారికి కాలనీపెద్దలు, క్రాంతి యూత్ సభ్యులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం డోలు, వాయిద్యాలు, పోతురాజుల నృత్యాలు, డీజే పాటలతో నృత్యాలు చేస్తూ ఊరేగింపు నిర్వహించారు. పట్టణంలోని క్లాక్ టవర్, గౌనీ చౌరాస్తా మీదుగా పోచమ్మ ఆలయం వరకు ఊరేగింపు కొనసాగింది.

● హత్నూర: మండల పరిధిలోని నస్తీపూర్, చింతల్ చెర్వు, చందాపూర్, గోవింద్రాజ్‌పల్లి గ్రామాల్లో బోనాల పండుగను గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి పోచమ్మ తల్లి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు బోనాలను ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

●పటాన్‌చెరు రూరల్: మండలంలో గురువారం బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఇస్నాపూర్, చిట్కుల్ గ్రామాల్లో జరిగిన ఉత్సవాల్లో ప్రముఖులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిట్కుల్ గ్రామంలో రెండేళ్లకోసారి జరిగే దుర్గమ్మ జాతరతో పాటు బోనాల ఉత్సవాలు మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. గురువారం బండ్ల ఊరేగింపు అట్టహాసంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు నీలం మధు ముదిరాజ్ కుటుంబ సమేతంగా పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఎన్ఎంఆర్ యువసేన ఆధ్వర్యంలో నిర్వహించిన బండ్ల ఊరేగింపు, ఫలహారం బండి వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు చేశారు. బండ్ల ఊరేగింపు చిట్కుల్ పురవీధుల మీదుగా సాగింది. ప్రత్యేక లైటింగ్, డీజే సౌండ్ ఆకటుకున్నాయి. ఈ వేడుకలలో భాగంగా ప్రత్యేకంగా రప్పించిన కేరళ కళాకారుల నృత్యాలు, డీజే సౌండ్‌లోని పాటలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఊరేగింపులో పోతురాజుల విన్యాసాలు చూపరులను అలరించాయి.



వెల్దుర్తి: ఆరెగూడెంలో బోనాలతో మహిళల ఊరేగింపు

● వెల్దుర్తి: మండల పరిధిలోని ఆరెగూడెంలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున బోనాలను ఊరేగించి దుర్గాభవాని అమ్మవారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మహేష్‌రెడ్డి, నాయకులు శేఖర్, శేఖగౌడ్, తేజ, నర్సింహారెడ్డి, సుధాకర్‌గౌడ్, మల్లేశం, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో గృహిణి ఆత్మహత్య

రామచంద్రాపురం, ఆగస్టు 1: కుటుంబ తగాదాలతో గృహిణి ఆత్మహత్య చేసుకున్న ఘటన కొల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని సైబర్ కాలనీలో బుధవారం రాత్రి చోటు చేసుకున్నది. ఎస్ఐ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. తమిళనాడుకు చెందిన హారతి(26) శబరీనాథ్ దంపతులు సైబర్ కాలనీలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు. బుధవారం సాయంత్రం రెండేళ్ల కుమారుడికి ఓ బంగారు ఆభరణం చేయించే విషయమై దంపతులిద్దరు గొడవ పడ్డారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన శిరీష ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుందని పోలీసులు పేర్కొన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

50 కిలోల గంజాయిస్వాధీనం

● పోలీసుల అదుపులో ఓ నిందితుడు..?

మనూరు, ఆగస్టు 1: దొంగ చాటుగా రవాణా చేయడానికి సిద్ధంగా ఉంచిన ఎండు గంజాయిని మనూరు పోలీసులు గురువారం తెల్లవారు జామున స్వాధీనం చేసుకుని, ఒకరిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని రాణాపూర్ తండాలో ఓ గోనె సంచిలో దాదాపు 50 కిలోల వరకు ఎండు గంజాయిని తరలించేందుకు సిద్ధంగా ఉందని మనూరు పోలీసులకు సమాచారమందింది. ఈ మేరకు పోలీసులు తెల్లవారు జామున దాడి చేసి గంజాయితో పాటు ఒకరిని అందుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. కాగా దాడి సమయంలో మరో ముగ్గురు నిందితులు పారిపోయినట్లు తెలిసింది. ఈ విషయమై మనూరు పోలీసులను సంప్రదించగా వివరాలు తెలిపేందుకు విముఖత చూపారు. ఎస్ఐ ఫోన్ లిఫ్ట్ చేయలేదు.

వ్యవసాయ భూముల్లో గంజాయి మొక్కల తనిఖీలు

కల్హేర్/కంగ్టి ఆగస్టు 1: వ్యవసాయ భూముల్లో వేసిన వివిధ రకాల పంటల్లో గుట్టు చప్పుడు కాకుండా అంతర పంటగా గంజాయి సాగు చేస్తే చర్యలు తప్పవని కంగ్టి సీఐ చంద్రశేఖర్ రెడ్డి, సిర్గాపూర్ ఎస్ఐ వెంకట్ రెడ్డి హెచ్చరించారు. సిర్గాపూర్, కంగ్టి మండలాల పరిధిలోని వాసర్, చందర్ నాయక్, బీబ్యానాయక్, సూర్యా ముణ్యా నాయక్, బోర్గి, చౌకన్‌పల్లి, మెట్టుతండా, రాంసింగ్ తండా, బాబుల్‌గాం తండాల్లోని సాగు భూముల్లో పోలీసులు గురువారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ మాటున గంజాయి సాగు చేస్తే కఠిన చర్యలు తప్పవని, అలాగే సాగు చేసే వారికి ప్రభుత్వ పథకాలు నిలిపివేయ బడతాయని సీఐ హెచ్చరించారు.

ప్రజల అవసరాల మేరకే తపాలా పొదుపు పథకాలు

పెద్దశంకరంపేట, ఆగస్టు 1: ప్రజల అవసరాలకు అనుగుణంగా తపాల శాఖలోమంచి పొదుపు పథకాలు ఉన్నాయని వీటిని ప్రజలు సద్వినియోగం పర్చుకోవాలని సంగారెడ్డిజిల్లా డివిజన్ పోస్టల్ ఎస్పీ ఎల్‌వీ మురళికుమార్ సూచించారు. గురువారం సంగారెడ్డి డివిజన్ పరిధిలోని టెంకటి బ్రాంచ్ పోస్టు ఆఫీసును పోస్టల్ ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం పోస్టల్ ఎస్పీ మాట్లాడుతూ తపాలా శాఖలో కుటుంబానికి భరోసానిచ్చే మంచి పొదుపు, బీమాపథకాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో టెంకటి బ్రాంచ్ పోస్ట్ మాస్టర్‌విజయ్‌కుమార్, ఏబీపీఎం, మురళి ఉన్నారు.

ఆకలితో ఎవరూ అలమటించొద్దు



ఆర్థిక సాయం అందజేస్తున్న బిగ్‌బాస్ విన్నర్ పల్లవి ప్రశాంత్

చిన్నశంకరంపేట, ఆగస్టు 1: ఆకలితో ఎవరూ అలమటించవద్దని సీజన్ 7 బిగ్‌బాస్ విన్నర్ పల్లవి ప్రశాంత్ పేర్కొన్నారు. ఇటీవల చిన్నశంకరంపేటకు చెందిన దదువాయి కౌలు రైతు అప్పులభారం అధికం కావడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటికి పెద్దదిక్కు కోల్పోవడంతో కుటుంబం వీధిన పడింది. తినడానికి తిండిలేక అలమటిస్తున్నారని తెలుసుకున్న బిగ్‌బాస్ విన్నర్ పల్లవి ప్రశాంత్ లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం బాధిత కుటుంబానికి రూ. 20వేలు, బియ్యం, నిత్యావసర వస్తువులను అందజేశారు. ఈసందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ రైతు పండిస్తేనే ప్రజలకు అన్నం దొరకుతుందని, రైతు మృతి తనను బాధించిందన్నారు. వెంట ఫౌండేషన్ ప్రతినిధులు నరేష్, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పోచయ్య, ఉపాధ్యాయులు, మహావీర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్లాట్ ఓనర్స్‌కు అనుకూలంగా లోకాయుక్త తీర్పు

రామచంద్రాపురం, ఆగస్టు 1: రామచంద్రాపురం మండల పరిధిలోని కొల్లూరు సర్వే నంబరు 174 నుంచి 190లలో ఉన్న ప్లాట్ ఓనర్స్‌కు అనుకూలంగా లోకాయుక్త తీర్పునిచ్చింది. 1984వ సంవత్సరం నుంచి కొల్లూరు ప్లాట్‌ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు తమ ప్లాట్లను సాధించుకోవడానికి ఏళ్ల తరబడి పోరాడుతున్న విషయం అందరికీ తెలిసిందే. పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, అలాగే తహసీల్దార్ తమ స్థలంలోని ప్లాట్లకు పాసుబుక్‌లు జారీ చేస్తున్నారంటూ 2022లో ప్లాట్ ఓనర్స్ లోకాయుక్తను ఆశ్రయించారు. దీంతో లోకాయుక్త సభ్యుల ఆరోపణలపై పోలీసులతో పాటు సంబంధిత రెవెన్యూ అధికారులను సమాధానం ఇవ్వాలంటూ ఆదేశాలు జారీ చేసింది. దీనిపై కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్లు ప్లాట్లు కలిగిన భూమిని ప్రొహిబిషన్ జాబితాలో చేర్చామని, ఎవరికీ పాసుపుస్తకాలు జారీ చేసేది లేదని స్పష్టం చేశారు. దీంతో లోకాయుక్త ప్లాట్‌ఓనర్స్‌కు న్యాయం చేసినట్టయ్యింది.

'ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణం వెంటనే చేపట్టాలి'

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 1 : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఈఎస్ఐ ఆస్పత్రుల నిర్మాణాలను వెంటనే చేపట్టాలని కోరుతూ ఈఎస్ఐ రీజినల్ బోర్డు మెంబర్ రవిశంకర్‌తో కలిసి బీఎంఎస్ నాయకులు గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ ఈఎస్ఐ రీజినల్ డైరెక్టర్ రేణుకా ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఎంఎస్ జిల్లా అధ్యక్షుడు తోట నరసింహారెడ్డి, కార్యదర్శి మోహన్‌రెడ్డిలు మాట్లాడుతూ సంగారెడ్డికి మంజూరైన ఆస్పత్రి కోసం ఇప్పటి వరకు స్థల కేటాయింపులు చేయలేదన్నారు. ప్రభుత్వం స్పందించి వంద పడకల ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

20 కిమీ పరిధిలో టోల్ వసూలు చేయొద్దు: బీజేపీ



టోల్ మేనేజర్ రాజేంద్ర రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న బీజేపీ నాయకులు

గుమ్మడిదల, ఆగస్టు 1 : గుమ్మడిదల టోల్ ప్లాజా నుండి 20 కిలోమీటర్ల పరిధిలో టోల్ గేట్ ఫీజ్ వసూలు చేయొద్దంటూ బీజేపీ నాయకులు టోల్ యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. గురువారం బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి ఆధ్వర్యంలో గుమ్మడిదల టోల్ గేట్ ముందు నిరసనకు దిగారు. టోల్ గేట్ వున్న పరిధిలోని 20 కిలోమీటర్ల పరిధిలో వాహన దారుల నుంచి టోల్ గేట్ ఫీజ్ వసూలు చేస్తున్నారని వాటిని వెంటనే ఆపాలని గోదావరి అంజిరెడ్డి డిమాండ్ చేశారు. అనంతరం టోల్ గేట్ మేనేజర్ రాజేందర్ రెడ్డికి ఒక విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గిద్దె రాజు, నియోజకవర్గ కన్వీనర్ రాజశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతరావు కులకర్ణి, నాయకులు పాల్గొన్నారు.

'క్రీడాభివృద్ధిలో నాగరాజు సేవలు మరువలేనివి'

మెదక్ అర్బన్, ఆగస్టు 1: క్రీడాభివృద్ధిలో నాగరాజు సేవలు మరువలేనివని జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు కొనియాడారు. గురువారం స్థానిక టీఎన్జీవో భవన్‌లో స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా యువజన క్రీడల శాఖ ఇన్‌చార్జి అధికారి నాగరాజు సన్మానసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. మూడేళ్ల పాటు విధుల పట్ల అంకిత భావంతో పని చేశారన్నారు. భవిష్యత్తులో నాగరాజు సేవలు ఉపయోగించుకుంటామన్నారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పాల్గొని మాట్లాడుతూ..అధికారులు ప్రజాభిమానం పొందాలని, పని చేసే చోట మంచి పేరు సంపాదించుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా నూతన యువజన క్రీడల శాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన దామోదర్ రెడ్డికి స్వాగత కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి సన్మానించారు.